సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం : 7 : ఫిబ్రవరి : 2024



ఆడబిడ్డలపై ఆగని అఘాయిత్యాలు

ప్రభుత్వాలు మారిన ఆడబిడ్డలపై అఘాయిత్యాలు ఆగడం లేదని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ అన్నారు.

- 8లో



బీఆర్‌ఎస్‌లో అవమానాలు..

బీఆర్‌ఎస్ అభివృద్ధికి శ్రమిస్తే చివరకు అవమానాలే మిగిలాయని మోతె పిచ్చిరెడ్డి, పూలమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.

- 8లో



కార్మికుల ఆందోళన

విద్యుత్ శాఖలో మీటర్ రీడింగ్ కార్మికులు ఆందోళన బాట పట్టారు. రీడింగ్ మిషన్లను ఏడీలకు అప్పగించి నిరసన తెలిపారు.

- 8లో

న్యూస్‌రీల్

వసతి గృహం పరిశీలన



ఎస్సీ వసతి గృహం పరిసరాలు పరిశీలిస్తున్న లక్ష్మిదేవి

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ వసతి గృహంలో ఇటీవల ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకోగా మంగళవారం రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ లక్ష్మీదేవి వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహ వసతులపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. వంట మనిషి, వంట విషయాలపై ఆరా తీశారు. విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో విద్యార్థినుల ఆత్మహత్యకు సంబంధించిన కేసు వివరాలను విచారించారు. పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు తెలిపారు. ఆమె వెంట రీజనల్ జాయింట్ డైరెక్టర్ మోతీ తదితరులున్నారు.

విద్యార్థుల ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపించాలి

భువనగిరిటౌన్: భువనగిరి పట్టణంలోని సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థుల ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేపట్టాలని, ప్రభుత్వం బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్ మూర్తి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లను గాలికి వదిలేశారని, కనీసం సొంత భవనాలు, వసతులు లేక రెగ్యులర్ వార్డెన్లు లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే ఇలాంటి సంఘటనలు తరచుగా జరుగుతున్నాయన్నారు. వెంటనే భువనగిరిలో జరిగిన సంఘటనపై సమగ్ర విచారణ చేసి విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు లావుడియా రాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు ఈర్ల రాహుల్ గంగాదేవి సాయికుమార్, శుద్ధగోని పరమేశ్వర్, నాగరాజు, శివ పాల్గొన్నారు.

యాదాద్రిలో లక్ష పుష్పార్చన



ఆలయంలో లక్ష పుష్పార్చన పూజ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో మంగళవారం ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో లక్ష పుష్పార్చన పూజలు జరిపించారు. ఇక ఆలయంలో క్షేత్రపాలకుడికి ఆకుపూజ నిర్వహించారు. ఆంజనేయ స్వామికి ఇష్టమైన రోజు కావడంతో తమలపాకులు, సింధూరంతో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజ వాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలు వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

గుండాల ఎంపీఓ సస్పెన్షన్

భువనగిరిటౌన్: గుండాల మండల పంచాయతీ అధికారి పి.జనార్దన్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ హనుమంతు కే.జండగే మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని మహిళా గ్రామ పంచాయతీ సెక్రెటరీలను వేధిస్తున్నారన్న అభియోగాలపై భువనగిరి డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ నివేదిక ప్రకారం సస్పెండ్ చేశారు. సస్పెన్షన్ కాలంలో మండల హెడ్ క్వార్టర్స్ దాటి వెళ్లకూడదని ఉత్తర్వుల్లో ఆదేశించారు.

ఎస్సీ అభివృద్ధి ఇన్‌చార్జ్ అధికారిగా శ్యాంసుందర్

భువనగిరిటౌన్: ఎస్సీ అభివృద్ధి జిల్లా ఇన్‌చార్జ్ అధికారిగా జినుకల శ్యాంసుందర్‌ను నియమిస్తూ మంగళవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సీ జిల్లా అభివృద్ధి అధికారి జైపాల్ రెడ్డి సెలవుపై వెళ్లడంతో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విధులు నిర్వహిస్తున్న శ్యాంసుందర్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు. మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

జల జగడం!



ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్ నేతలతో హైదరాబాద్‌లో సమావేశమైన కేసీఆర్, చిత్రంలో జగదీష్‌రెడ్డి తదితరులు

- కృష్ణా ప్రాజెక్టులను కేసీఆరే కేఆర్‌ఎంబీకి రాసిచ్చారని కాంగ్రెస్ వాదన
- 2015లో అధికారులు సంతకం చేశారని మంత్రి కోమటిరెడ్డి వెల్లడి
- దొంగ నాటకాలు ఆడుతున్నారని బీఆర్‌ఎస్ ఎదురుదాడి
- నల్లగొండ వేదికగా ఆందోళనకు సిద్ధమైన గులాబీ పార్టీ
- 13న భారీ బహిరంగ సభ.. హాజరుకానున్న మాజీ సీఎం కేసీఆర్
- సభకు అనుమతి లభించడంపై అనుమానాలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కృష్ణా జలాలపై జగడం ముదురుతోంది. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కృష్ణానది యాజమాన్య బోర్డుకు (కేఆర్‌ఎంబీ) అప్పగించడంపై రాజకీయ పార్టీల్లో కాక రేపుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీలు సవాళ్లు, ప్రతి సవాళ్లు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నల్లగొండ వేదికగా ఆందోళనకు సిద్ధమయ్యారు. ఈ నెల 13న నల్లగొండలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని బీఆర్‌ఎస్ పార్టీ నిర్ణయించింది. సభ నిర్వహణపై మంగళవారం కేసీఆర్ అధ్యక్షతన హైదరాబాద్‌లో జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ దక్షిణ తెలంగాణ జిల్లాల నాయకుల సమావేశంలో చర్చించారు. 2 లక్షల మందితో నిర్వహించే ఈ బహిరంగ సభకు కేసీఆర్ హాజరు కానున్నారు. కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగింత విషయంలో అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య చిచ్చు రాజుకుంటోంది. మీరంటే మీరే కేంద్రానికి ప్రాజెక్టులు అప్పచెప్పారంటూ ఘాటైన దూషణలకు దిగుతున్నాయి. మూడు రోజుల ముందే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాజెక్టుల అప్పగింత వ్యవహారం విషయంలో బీఆర్‌ఎస్ తీరుపై మండిపడ్డారు. ప్రాజెక్టులను అప్పగించేందుకు అప్పటి ప్రభుత్వం, అప్పటి సీఎం కేసీఆర్ అంగీకరించినందునే రాష్ట్ర విభజన చట్టంలోనే పొందుపరిచారని, దీనిపై అసెంబ్లీలో చర్చకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డి సవాల్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించి తాము సిద్ధమని ప్రకటించారు.

జిల్లా నేతల మధ్య మాటల యుద్ధం

ఇదే క్రమంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాజెక్టుల అప్పగింతపై సోమవారం తీవ్రంగా స్పందించారు. కేసీఆరే హయాంలోనే కేంద్రానికి ప్రాజెక్టులు అప్పగించారని మండిపడ్డారు. మరోవైపు రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండలో సోమవారం విలేకరుల సమావేశంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు అప్పగింత కేసీఆర్ పుణ్యమేనని, దాంతోనే జిల్లాలో తాగునీటి కష్టాలు ఏర్పడ్డాయంటూ ఆరోపించారు. కృష్ణానది పరిధిలోని ప్రాజెక్టులను అప్పగించేందుకు అంగీకరిస్తూ 2015లో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే అధికారులు సంతకాలు చేసిన పత్రాలంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బయట పెట్టారు. మరోవైపు.. కాంగ్రెస్ చేతకానితనం వల్లే నాగార్జునసాగర్ ప్రాజెక్టు చేజారిపోతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి ఆరోపించారు. ప్రాజెక్టును కేంద్రానికి అప్పగించి దొంగ నాటకాలు ఆడుతున్నారంటూ విమర్శించారు. ప్రాజెక్టులను కేంద్ర పరిధిలోకి తీసుకుపోవడమంటే ఆంధ్రాకు అప్పనంగా నీరు రాసివ్వడమేనని మండిపడ్డారు.

బీఆర్‌ఎస్ సభకు పోలీసు అనుమతి వచ్చేనా..

కృష్ణా ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసగా ఈ నెల 13న నల్లగొండలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించారు. అయితే ఈ సభకు పోలీసులు అనుమతి ఇస్తారా? లేదా? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరందుకుంది. జిల్లాలో ముందస్తు అనుమతి లేకుండా నెల రోజుల వరకు ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ప్రదర్శనలు, బహిరంగ సభలు నిర్వహించడానికి వీల్లేదని, 30, 30ఏ పోలీసు యాక్టును అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ చందనాదీప్తి సోమవారమే ప్రకటన జారీచేశారు. మూడు రోజుల కిందటే నల్లగొండలో భారీ బహిరంగసు నిర్వహించాలని బీఆర్‌ఎస్ నిర్ణయానికి వచ్చిన నేపథ్యంలో పోలీసు శాఖ నుంచి సోమవారం ఈ ప్రకటన వెలువడటం చర్చనీయాంశంగా మారింది.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



ప్రభుత్వ వసతి గృహాల వార్డెన్లు, సంక్షేమ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సాక్షి,యాదాద్రి: వసతి గృహాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రభుత్వ వసతి గృహాల వార్డెన్లు, సంక్షేమ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వసతి గృహాల పనితీరును సమీక్షించారు. విద్యార్థుల తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టేలా వసతి గృహాల నిర్వహణ ఉండాలన్నారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. అబ్‌నార్మల్‌గా ఉన్న విద్యార్థుల గురించి, వారి తల్లిదండ్రులకు తెలియ చేసి ప్రత్యేకంగా మాట్లాడాలన్నారు. తరచూ పేరెంట్స్ మీటింగ్ నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు ఇచ్చే ఫిర్యాదులపై అలసత్వం వహించొద్దని, వెంటనే విచారించాలన్నారు. సాయంత్రం 5 గంటల తరువాత ఎవరినీ వసతి గృహాల్లోకి అనుమతించొద్దని, కూరగాయలు, వసతులు సమకూర్చే వారిని సైతం ఉదయం సమయాల్లో మాత్రమే అనుమతించాలన్నారు. కౌన్సిలింగ్ సెషన్స్ ద్వారా విద్యార్థుల్లో మనోధైర్యం పెరిగేలా కృషి చేయాలన్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండడంతో ప్రతిఒక్క విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని, వెనుకబడ్డ విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. వసతి గృహాల్లో పారిశుద్ధ్య చర్యలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్యాంసుందర్, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారి యాదయ్య, సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు, ఆశ్రమ పాఠశాలల ప్రిన్సిపాల్స్, వసతి గృహాల వార్డెన్లు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌పై ఇంటింటి సర్వే



మోత్కూరులో పరిశీలన చేస్తున్న సీజీఎం, ఎస్ఈ

మోత్కూరు: మోత్కూరు, అడ్డగూడూరు, గుండాల మండలాల్లో ట్రాన్స్‌కో అధికారులు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌పై ఇంటింటి సర్వే చేపట్టారు. ఈమేరకు సర్వేను ట్రాన్స్‌కో చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) భిక్షపతి, ఎస్ఈ శ్రీనాథ్ మంగళవారం పరిశీలించారు. సిబ్బంది నమోదు వివరాలను పర్యవేక్షించారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి ఈ నెల 15 వరకు వివరాల నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. వారి వెంట భువనగిరి డీఈఈ మల్లికార్జున్, మోత్కూరు ఏడీఈ బాలునాయక్, మోత్కూరు, అడ్డగూడూరు ఏఈలు హుస్సేన్, ఉమ తదితరులున్నారు.

పెద్దచెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దుతా

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి పెద్ద చెరువును మినీట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దుతామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని టూరిజం పార్కులో వివిధశాఖల అధికారులతో కలిసి మున్సిపాలిటీ, మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, నిలిచిపోయిన పనులపై సమీక్ష నిర్వహించారు. అదే విధంగా చెరువు కట్టను సందర్శించి, చేపట్టనున్న రోడ్డు పనులు పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హెరిటేజ్ విలేజ్‌గా అంతర్జాతీయ అవార్డు పొందిన భూదాన్‌పోచంపల్లిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించామన్నారు. హెచ్‌ఎండీఏ ద్వారా చెరువు చుట్టూ రింగ్ రోడ్డు ఏర్పాటు చేస్తామని చెప్పారు. జలాల్‌పురం చిల్డ్రన్ పార్కు అభివృద్ధి చేసి, చెరువు లోపలివరకు సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మించి మరింత సుందరీకరణ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అసంపూర్తి కాల్వలను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి, వైస్‌చైర్మన్ బాత్క లింగస్వామి, తహసీల్దార్ వీరాబాయి, ఎంపీడీఓ బాలశంకర్, మున్సిపల్ పబ్లిక్‌హెల్త్ డీఈ మనోహరి, హెచ్‌ఎండీఏ ఫారెస్ట్ రేంజ్ అధికారిణి అఫ్రోస్, పీఆర్ ఏఈ వెంకటేశం, ఇరిగేషన్ డీఈ అభిషేక్, ఏఈ సాయి, మిషన్‌భగీరథ డీఈ దీన్‌దయాళ్, మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ నాగిరెడ్డి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మహిళా వికలాంగులకు ఉపాధి కల్పించాలి

భువనగిరిటౌన్: మహిళా వికలాంగులకు కుటీర పరిశ్రమ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర సహాయ కార్యదర్శి వనం ఉపేందర్, జిల్లా అధ్యక్షుడు సురుపంగ ప్రకాష్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానికంగా ఎన్‌పీఆర్‌డీ మహిళా విభాగం జిల్లా కమిటీ సమావేశం కొత్త లలిత అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళా వికలాంగులను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయని ఆరోపించారు. వికలాంగులపై వేధింపులు అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని, మహిళా వికలాంగులను వివాహం చేసుకున్న వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. వికలాంగుల కుటుంబాలకు అంత్యోదయ రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. సమావేశంలో మధిర పద్మ, కొండాపూర్ మనోహర, బర్ల పార్వతి, కుంచోతు అనసూయ, చంద్రకళ పాల్గొన్నారు.

11 నుంచి కొండపైకి ఆటోల అనుమతి



సమీక్ష నిర్వహిస్తున్న బీర్ల ఐలయ్య, పాల్గొన్న కలెక్టర్, డీసీపీ, ఈఓ, వివిధ శాఖల అధికారులు

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట: యాదాద్రి కొండపైకి ఈ నెల 11 నుంచి ఆటోలకు తిరిగి అనుమతిస్తామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. యాదాద్రి కొండపై కలెక్టర్ హనుమంతు కె.జండగె, డీసీపీ రాజేష్‌చంద్ర, ఆలయ ఈఓ రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తితో కలిసి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ యాదాద్రి కొండపైకి ఆటోలను అనుమతించాలని దేవాదాయశాఖ మంత్రి, దేవాదాయశాఖ కమిషనర్‌కు లేఖను పంపించామన్నారు. 11న దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆటోలను కొండపైకి పునః ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ప్రతిరోజు 100 ఆటోలకు అనుమతిస్తామని, ప్రతి ఆటోకు శ్రీస్వామి వారి చిత్రపటంతో పాటు నంబర్ కేటాయిస్తామని చెప్పారు. వేకువజామున 3గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ఒక షిఫ్ట్, మధ్యాహ్నం 1గంట నుంచి రాత్రి 11గంటలకు రెండవ షిఫ్ట్‌గా నడిపిస్తామన్నారు. కొండపైన 25 ఆటోలు, కొండ కింద 25 ఆటోలను పెట్టుకునేలా వెసులుబాటు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మొదటి ఘాట్ రోడ్డును ప్రత్యేకంగా ఆటోలకే కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఆటో ముగ్గురు భక్తులనే ఎక్కించుకోవాలని, దేవస్థానం నిర్ణయించిన ధరలకే చార్జీలు తీసుకోవాలని వెల్లడించారు. కొండపైకి భక్తుల కార్లు అనుమతించే విషయాన్ని దేవాదాయశాఖ మంత్రితో చర్చించిన తరువాత నిర్ణయం తీసుకుంటామన్నారు. వారం, పది రోజుల్లో కొండపైన ఆలయ పరిసరాల్లో కొబ్బరికాయ కొట్టే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. కొండపైన శ్రీస్వామి వారి సన్నిధిలో భక్తులు నిద్ర చేసేలా 10 రోజుల్లో డార్మింటరీ హాల్ ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఏసీపీలు, దేవాలయ, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు.. 33,827

- ముగిసిన ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తుల స్వీకరణ
- అత్యధికంగా భువనగిరిలో.. అత్యల్పంగా బి.రామారంలో నమోదు
- ఈనెల 24న ముసాయిదా జాబితా
- అదేరోజు నుంచి మార్చి 14 వరకు మరోమారు దరఖాస్తుల స్వీకరణ



సాక్షి, యాదాద్రి: వరంగల్- ఖమ్మం- నల్లగొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ఓటర్ల నమోదు ప్రక్రియ మంగళవారం ముగిసింది. గ్రాడ్యుయేట్లు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు తమ ఓటుహక్కు నమోదు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 2021 మార్చిలో 37,028 ఓట్లు ఉండగా 2024లో ఇప్పటివరకు 33,827 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఏకారణం చేతనైనా ఓటు నమోదు చేసుకోకుండా మిగిలిపోయిన వారు మరోసారి దరఖాస్తు చేసుకోవడానికి ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చింది. ఈమేరకు ఫిబ్రవరి 24 నుంచి మార్చి 14 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు.

మార్చి 14వరకు అభ్యంతరాల స్వీకరణ

ఓటరు నమోదు ఫారం-18 ద్వారా ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్‌లో రెండు విధాలుగా దరఖాస్తులను స్వీకరించారు. 2023 నవంబర్ 1 నాటికి డిగ్రీ పూర్తయి మూడేళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకున్నారు. ఫిబ్రవరి 6వ తేదీ నాటికి వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించిన అనంతరం ఫిబ్రవరి 24న ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రకటిస్తారు. ఈ జాబితాపై మార్చి 14 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. అభ్యంతరాలను పరిష్కరించిన అనంతరం ఏప్రిల్ 4న తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తారు.

విస్తృతంగా ప్రచారం..

పట్టభద్రుల ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ కొత్తగా ఓటు హక్కు నమోదు కోసం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. 2021 మార్చిలో జరిగిన ఎన్నికల్లో ఓటు వేసినప్పటికీ తాజాగా ఓటుకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని యంత్రాంగం కోరింది. కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు, తహసీల్దార్‌లు జిల్లా వ్యాప్తంగా ఓటరు నమోదుకు ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించారు.

అత్యధికంగా భువనగిరిలో..

భువనగిరిలో అత్యధికంగా ఎమ్మెల్సీ ఓటరు నమోదు జరిగింది. ఆతర్వాత చౌటుప్పల్, వలిగొండలో ఓటు నమోదు చేసుకున్నారు. అత్యల్పంగా బొమ్మలరామారం, ఆ తర్వాత అడ్డగూడూరు మండలంలో ఓటు నమోదు చేసుకున్నారు. ఈసారి ఆఫ్‌లైన్ కంటే ఆన్‌లైన్‌లోనే అత్యధికంగా నమోదు చేసుకున్నారు. అయితే 24,295 దరఖాస్తులు అధికారుల పరిశీలనలో వివిధ స్థాయిలో ఉన్నాయి.

మంగళవారం నాటికి దరఖాస్తు చేసుకున్న ఓటర్లు

మండలం	ఆన్‌లైన్	ఆఫ్‌లైన్	మొత్తం
అడ్డగూడూరు	967	27	994
ఆలేరు	2,059	0	2,059
ఆత్మకూర్	1,446	0	1,446
భువనగిరి	4,943	23	4,966
బీబీనగర్	2,049	2	2,051
బొమ్మలరామారం	876	0	876
గుండాల	1,156	1	1,077
మోత్కూర్	1,465	5	1,470
రాజాపేట	1,017	0	1,017
తుర్కపల్లి	993	4	997
యాదగిరిగుట్ట	1,899	21	1,920
చౌటుప్పల్	3,710	56	3,766
నారాయణపురం	1,933	0	1,933
పోచంపల్లి	2,000	3	2,003
రామన్నపేట	2,539	0	2,539
వలిగొండ	3,551	65	3,557
మొత్తం	33,678	149	33,827

మరోసారి దరఖాస్తుకు అవకాశం



"ఎమ్మెల్సీ ఓటరు నమోదు జిల్లాలో మరోమారు అవకాశం ఉంది. దరఖాస్తు చేసుకోకుండా మిగిలిపోయిన వారుంటే ఈనెల 24నుంచి మార్చి 14 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాల్లో బీఎల్ఓలు అందుబాటులో ఉంటారు. ఆన్‌లైన్, లేదా ఆఫ్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చు. ఓటరు జాబితా డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఈనెల 24న విడుదల చేస్తాం. అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయొచ్చు.

– భాస్కర్‌రావు, జిల్లా ఎన్నికల సహాయ అధికారి

చదువుపై శ్రద్ధ కనబరచాలి

సాక్షి,యాదాద్రి: విద్యార్థులు చదువుపై శ్రద్ధ కనబరచాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. సేవా భారత్ స్వచ్ఛంద సేవా సంస్థ, చౌటుప్పల్ ఆధ్వర్యంలో రాయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రతి రోజూ బాదం పాలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 14 ఏళ్లుగా అమ్మనాన్న ఫౌండేషన్ తరఫున అనాథ వృద్ధులు, మానసిక దివ్యాంగులను చేరదీసి వారికి సేవలందిస్తూనే గత రెండు సంవత్సరాలుగా సేవా భారత్ పేరిట పాఠశాల విద్యార్థులకు పోషక విలువలు కలిగిన బాదం పాలు అందించడం గొప్ప విషయమన్నారు. జిల్లాలో మరిన్ని పాఠశాలలను దత్తత తీసుకొని తమ సేవలందించాలని కోరారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సేవా భారత్ సంస్థ అధ్యక్షుడు గట్టు శంకర్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణరెడ్డి, కౌన్సిలర్ అరుణచందర్, ప్రధానోపాధ్యాయులు అండాలు, ఉపాధ్యాయుడు రంగయ్య, సేవా భారత్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



అభివాదం చేస్తున్న యూనియన్ నాయకులు

భువనగిరిటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న నిర్వహించే దేశ వ్యాప్త కార్మిక సమ్మెను, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ జిల్లా సదస్సు పిలుపునిచ్చింది. మంగళవారం జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో కార్మిక సంఘాల జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ,, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్‌లు మాట్లాడుతూ సదస్సులో పలు తీర్మానాలు చేసినట్లు చెప్పారు. ఫిబ్రవరి 16న అన్ని కార్మిక, రైతు, వ్యవసాయ, ప్రజాసంఘాలను కలుపుకొని గ్రామాల్లో బంద్, మండల కేంద్రాల్లో భారీ ర్యాలీలు, రాస్తారోకోలు నిర్వహించాలని తీర్మానించినట్లు తెలిపారు. ఆలేరు ఫిబ్రవరి 9, చౌటుప్పల్‌లో 10, యాదగిరిగుట్టలో 11న రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పద్మ సుదర్శన్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రన్న అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి జనార్దన్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గడ్డం నాగరాజు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు రేగు బలనర్సింహ, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ ,ఐఎన్‌టీయూసీ జిల్లా నాయకులు మురళి, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లి శంకర్, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రగ్బీ సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా తరుణ్‌రెడ్డి

మఠంపల్లి: రగ్బీ సెలెక్షన్ కమిటీ రాష్ట్ర చైర్మన్‌గా మఠంపల్లికి చెందిన కర్నాటి తరుణ్‌రెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉత్తర్వులు జారీ చేసినట్లు తరుణ్‌రెడ్డి మంగళవారం పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా అందించిన సేవలను గుర్తించి సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా నియమించినట్లు తెలిపారు. నాలుగేళ్ల పదవిలో కొనసాగుతానని తెలిపారు.

రెండు లారీల మధ్య చిక్కుకుని డ్రైవర్ మృతి

రఘునాథపల్లి (వరంగల్): రెండు లారీల మధ్య చిక్కుకొని డ్రైవర్ మృతిచెందాడు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం సవుల్లతండాకు చెందిన ఇస్లావత్ రవి (32) లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం కాళేశ్వరం నుంచి హైదరాబాద్‌కు ఇసుక తరలిస్తున్నాడు. ఈ క్రమంలో టోల్‌ప్లాజా వద్ద కాసేపు సేదదీరేందుకు లారీ ఆపాడు. ఏమరుపాటులో లారీని హ్యాండ్ బ్రేక్ వేయకుండా పార్కింగ్ చేసి టీ తాగడానికి వెళ్లాడు. ఈ క్రమంలో ఆ లారీ కదులుతూ ముందున్న మరోలారీ వద్దకు వెళ్తుండగా గుర్తించాడు. వేగంగా వెళ్లి వాహనాన్ని నిలిపివేసే క్రమంలో రెండు లారీల మధ్య చిక్కుకుని అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలుడిని చితకబాదిన ఉపాధ్యాయురాలు

- పోలీస్‌స్టేషన్‌లో తల్లిదండ్రుల ఫిర్యాదు


సూర్యాపేటరూరల్: నర్సరీ విద్యార్థిని ఓ ఉపాధ్యాయురాలు విచక్షణారహితంగా చితకబాదింది. ఈ ఘటనపై బాధితురాలి తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సూర్యాపేట పట్టణం 13వ వార్డులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట పట్టణంలోని జనగాం క్రాస్ రోడ్డులో నివాసం ఉంటున్న ధరావతు బాలు–పార్వతీల కుమారుడు సుహాస్ ప్రిన్స్‌ను 13వవార్డులోని ఓ ప్రైవేట్ స్కూల్ నర్సరీలో జాయిన్ చేశారు. బాలుడు అల్లరి చేస్తున్నాడని ఉపాధ్యాయురాలు సోమవారం బెత్తంతో కొట్టిందని తల్లిదండ్రులు ఆరోపించారు. దీంతో మంగళవారం తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులతో వాగ్వాదానికి దిగి, ఆందోళన చేశారు. స్పందించిన ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ సదరు ఉపాధ్యాయురాలుని తొలగిస్తామని చెప్పినప్పటికి తల్లిదండ్రులు వినలేదు. చివరికి స్థానిక పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసినట్లు తల్లిదండ్రులు తెలిపారు.

● అతిథులొచ్చారు

సూర్యాపేట జిల్లా కర్విరాల కొత్తగూడెం గ్రామంలో సైబీరియన్ దేశ కొంగల సందడి నెలకొంది. దాదాపు 5,200 కిలో మీటర్లు ప్రయాణించి ఈ కొంగలు ప్రతి ఏటా ఇక్కడికి వస్తుంటాయి. గ్రామంలోని చెరువు, ఇళ్ల మధ్య చెట్లపై దాదాపు వందల సంఖ్యలో సైబీరియన్ కొంగల అరుపులు, శబ్దాలు చూపురులను ఆకట్టుకుంటున్నాయి. ఏటా తమ గ్రామానికి వచ్చే సైబీరియన్ కొంగలను కొత్తగూడెం వాసులు బంధువుల్లా చూస్తారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట




అందరున్నా అనాథలుగా బతకలేక..

- క్రిమిసంహారక మందు తాగిన వృద్ధ దంపతులు
- భర్త మృతి.. భార్య పరిస్థితి విషమం
- మాడుగులపల్లి మండలం ఆగామోత్కూర్‌లో విషాదం

మాడుగులపల్లి : అందరూ ఉన్నా ఆ వృద్ధ దంపతులకు ఆలనా పాలనా కరువైంది. శరీరంలో సత్తువ సన్నగిల్లి అనారోగ్యం బాధిస్తుంటే పట్టెడన్నం పెట్టేందుకు ఎవరూ ముందుకు రాలేదు. అప్యాయత, అనురాగాలకు దూరమై ఒంటరిగా బతకలేక తీవ్ర మానసిక క్షోభ అనుభవించారు. ముగ్గురు కుమారులను రెక్కలు ముక్కలు చేసుకొని పోషించిన వారు జీవిత చరమాంకంలో అందరికీ భారమై చివరకు తనువు చాలించేందుకు క్రిమిసంహాకర మందు తాగారు. దాంతో భర్త మృతిచెందగా భార్య పరిస్థితి విషయంగా ఉంది. నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలంలోని



లింగయ్య (ఫైల్)

ఆగామోత్కూర్ గ్రామంలో జరిగిన ఈ విషాద ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన మల్లెబోయిన లింగయ్య (82)–పెంటమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, కుమార్తె సంతానం. వీరికి మూడెకరాల పొలం ఉండడంతో ముగ్గురికి సమానంగా పంచారు. కొన్నేళ్ల క్రితం రెండో కుమారుడు రాములు మృతిచెందగా.. పెద్దకుమారుడు సైదులు మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లిలో స్థిరపడ్డాడు. నాటినుంచి దివ్యాంగుడైన చిన్నకుమారుడు శ్రీను తల్లిదండ్రుల ఆలనాపాలనా చూస్తున్నాడు. కొన్నినెలలుగా ఇద్దరు కుమారులు, కోడళ్ల మధ్య ఆస్తి, ఆసరా పింఛన్ డబ్బుల విషయంలో తగాదాలు జరుగుతున్నాయి. దాంతో వృద్ధదంపతులిద్దరూ చిన్నకుమారుడి ఇంట్లోనే ఒక గదిలో వేరుగా ఉంటున్నారు. అనారోగ్య సమస్యలు, ఒంటరితనం, ఆస్తి తగాదాల నడుమ ఆ పండుటాకులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. తమకు పట్టెడన్నం పెట్టేవారు కరువయ్యారన్న ఆవేదనలో సోమవారం రాత్రి ఇంట్లో క్రిమిసంహాకర మందు తాగారు. అర్ధరాత్రి కుమారుడు గుర్తించగా అప్పటికే తండ్రి చనిపోగా తల్లి పెంటమ్మ కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండడంతో స్థానికుల సాయంతో నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి కూడా విషయంగా ఉన్నట్లు తెలిసింది. లింగయ్య మృతదేహానికి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుమార్తె పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ కుమార్ తెలిపారు. ఈ ఘటనతో ఆగామోత్కూర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. లింగయ్య దంపతుల పరిస్థితి తలచుకొని గ్రామస్తులు కంటతడి పెట్టారు.

సారా తాగి ఒకరి మృతి

- మరొకరి పరిస్థితి విషమం
- సారాలో విషం కలిపారని కుటుంబ సభ్యుల ఆరోపణ

డిండి: సారా తాగి ఒకరు మృతిచెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. డిండి మండలం వీరబోయినపల్లిలో మంగళవారం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వీరబోయినపల్లి గ్రామానికి చెందిన నంది సహదేవుడు(42) తన కుటుంబ సభ్యులతో కలిసి స్థానికంగానే ఉంటూ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సహదేవుడికి దగ్గరి బంధువైన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం వెలుమపల్లికి చెందిన చెనమోని జంగయ్య సోమవారం సాయంత్రం ఫోన్ చేసి నీ వ్యవసాయ భూమిలోని ఓ చెట్టు వద్ద సీసాలో సారా ఉంచానని చెప్పాడు. రాత్రి సమయంలో సహదేవుడు ఆ సారాయి తీసుకుని ఇంటికి చేరుకున్నాడు. అనంతరం సహదేవుడు కొద్దిగా సారా తగగా విషం కలిపినట్లు అనుమానం వచ్చింది. కుమారుడు రాముని పిలిచి విషయం చెప్పగా అతను కూడా కొద్దిగా నోట్లో పోసుకుని పరీక్షించాడు. కొద్ది సేపటికే తండ్రీ కుమారుడు వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యారు. వారిని కుటుంబ సభ్యులు తొలుత దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో సహదేవుడు మృతిచెందాడు. రాము హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దేవరకొండ ఆస్పత్రిలో మంగళవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

భూ తగాదాలతో సారాలో విషం కలిపారు

సహదేవుడి కుటుంబానికి అదే గ్రామానికి చెందిన పలువురితో భూ తగాదాలు ఉన్నాయని మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలోనే సదరు వ్యక్తులతో కుట్ర పన్నిన జంగయ్య విషం కలిపిన సారాయిని సహదేవుడిని తాగేలా చేసాడని వారు ఆరోపించారు. ఇందుకు కారణమైన వ్యక్తులను చట్టపరంగా శిక్షించి న్యాయం చేయాలని వీరబోయనపల్లి బీటీరోడ్డుపై కాసేపు ధర్నా చేశారు. ఎస్‌ఐ.సైదులు తన సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులకు సర్ది చెప్పడంతో ధర్నా విరమించారు. మృతుడి భార్య అంజనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తూర్పుగూడెంలో దొంగతనాలు

- ఏడు ఇళ్లకు కన్నాలు వేసిన దుండగులు
- నగదు, వెండి, బంగారు ఆభరణాల అపహరణ

తుంగతుర్తి: గుర్తుతెలియని వ్యక్తులు తుంగతుర్తి మండలం తూర్పుగూడెం గ్రామంలో హల్‌చల్ సృష్టించారు. సోమవారం రాత్రి గ్రామానికి చెందిన ఏడుగురి ఇళ్లలోకి చొరబడి నగదు, వెండి, బంగారు ఆభరణాల అపహరించుకుపోయారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగూడెం గ్రామానికి చెందిన సంకినేని రామచందర్‌రావు కుటుంబ సభ్యులు ఇటీవల ఊరికి వెళ్లారు. గుర్తించిన దుండగులు రాత్రి సమయంలో అతడి ఇంట్లోకి చొరబడి అరతులం బంగారం, కేజీ వెండి ఆభరణలు, రూ.10వేల నగదు, అలాగే గట్టు జగదాంబ ఇంట్లో 20 తులాల వెండి కడియాలు, ముత్యం కాంతమ్మ ఇంట్లో పావు తులం బంగారం, 30 తులాల వెండి, రూ.10వేల నగదు, గునిగంటి కమలమ్మ ఇంట్లో 22 తులాల వెండి పట్టిలు, రూ.15వేల నగదు, హజారి జగ్గయ్య, సంకినేని వెంకటేశ్వరరావు, లింగంపల్లి కలమ్మ ఇండ్లలో చోరీకి పాల్పాడ్డారు. మొత్తం ఏడుగురి ఇళ్లలో తులం బంగారం, 1.7కిలోల వెండి ఆభరణాలు, కొంత నగదు చోరీ జరిగినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఏడుకొండలు తెలిపారు. కాగా ఇటీవల తుంగతుర్తిలో గుర్తు తెలియని వ్యక్తులు ఆగ్రోస్ ఫెర్టిలైజర్ షాపులో రూ.2లక్షల నగదు, బైక్‌ను అపహరించారు. అపహరించిన బైక్‌ను మామిడాల గ్రామ సమీపంలో వదిలి వెళ్లారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష, జరిమానా

యాదగిరిగుట్ట రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ ఆలేరు జేఎఫ్‌సీఎమ్ కోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. హన్మకొండ మండలం పైడిపల్లి గ్రామానికి చెందిన దామరస్వామి హన్మకొండ బస్ డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. 2015వ సంవత్సరం నవంబర్ 23న దామరస్వామి హైదరాబాద్‌లో ప్రయాణికులను ఎక్కించుకుని హన్మకొండకు బయలుదేరాడు. యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామానికి రాగానే బస్సు, హైదరాబాద్ వైపు వెళ్తున్న రాజాపేట మండలం కుర్రారం గ్రామానికి ఎర్రగుంట స్వామి (25) ఎర్ర తిరుమలేష్ (25)ల బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై అప్పటి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. వాదోపవాదనల అనంతరం ఆర్టీసీ డ్రైవర్ ధామర స్వామికి ఆలేరు కోర్టు ఏడాది జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

వివాహం కావడం లేదని.. యువకుడి ఆత్మహత్య



కమలాకర్ (ఫైల్)

భువనగిరి క్రైం : వివాహం కావడం లేదని ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. యాదాద్రి భువనగిరి జిల్లా బస్వాపురం గ్రామానికి చెందిన ఉడుత రాములు, సుశీలమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు సంతానం. వీరి రెండో కుమారుడైన కమలాకర్ (27) ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కమలాకర్ కొంతకాలంగా మద్యానికి బానిసగా మారాడు. కుటుంబ సభ్యులు ఇతడికి వివాహం చేసేందుకు సంబంధాలు చూస్తున్నా మద్యానికి బానిసయ్యాడన్న కారణంతో కుదరడం లేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన కమలాకర్ సోమవారం రాత్రి భువనగిరి– పగిడిపల్లి రైల్వేస్టేషన్‌ల మధ్య గల 226/27–25 మైలురాయి వద్ద ఎగువ పట్టాలపై కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో రైల్వే హెడ్ కానిస్టేబుల్ జె.కృష్ణారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించారు. పెళ్లికావడం లేదన్న కారణంతోనే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తల్లి సుశీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

మనోవేదనతో భూనిర్వాసితుడు మృతి



నర్సిరెడ్డి (ఫైల్)

చౌటుప్పల్ : రీజినల్ రింగ్ రోడ్డులో తన వ్యవసాయ భూమి పోతుందని రైతు తీవ్ర మనోవేదనతో మృతిచెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం మందోళ్లగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని సింగరాయచెరువు గ్రామానికి చెందిన మామిడి నర్సిరెడ్డి(70)కి భార్య లక్ష్మినర్సమ్మ, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు జంగారెడ్డి ఉన్నారు. వీరికి గ్రామ శివారులో చిన్నకొండూరు రెవెన్యూ పరిధిలో 8ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. వ్యవసాయమే ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. ఇటీవల ఆ భూమిలో నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు కోసం హద్దులు వేశారు. ఉన్న పొలంలో ఆరు ఎకరాలు రోడ్డు కోసం కోల్పోవాల్సి వస్తుండడంతో నర్సిరెడ్డి ఆందోళన చెందారు. పలు గ్రామాలకు చెందిన రైతులంతా కలిసి రీజినల్ రింగ్‌రోడ్డు భూబాధితుల సంఘం ఏర్పాటు చేసుకోగా అందులో నర్సిరెడ్డి చురుకైన పాత్ర పోషించేవాడు. రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నపాలు సైతం అందజేశారు. అయినా ఫలితం దక్కలేదు. ఇటీవల రీజినల్ రింగ్ రోడ్డు ప్రక్రియ వేగం కావడంతో నర్సిరెడ్డి మరోసారి ఆందోళనకు గురయ్యాడు. జిల్లా మంత్రితోపాటు భువనగిరి, మునుగోడు ఎమ్మెల్యేలను ఇతర రైతులతో కలిసి గోడు వెళ్లబోసుకున్నాడు. ఆ క్రమంలో సోమవారం అర్ధరాత్రి దాటాక నిద్రలోనే తుదిశ్వాస విడిచాడు.

బీఆర్‌ఎస్‌లో అవమానాలు.. చీత్కారాలు

- మాజీ ఎమ్మెల్యే గొంగిడి దంపతుల వైఖరితోనే పార్టీని వీడుతున్నాం
- పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి, నార్మాక్ మాజీ డైరెక్టర్ మోతె పూలమ్మ వెల్లడి



రాజీనామా పత్రాలను చూపుతున్న మోతె పిచ్చిరెడ్డి, పూలమ్మ దంపతులు

ఆత్మకూరు(ఎం): ఆలేరు నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తే చివరకు అవమానాలు, చీత్కారాలే మిగిలాయని పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి, నార్మాక్ మాజీ డైరెక్టర్ మోతె పూలమ్మ ఆవేదనవ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత దంపతుల వైఖరి కారణంగానే బీఆర్‌ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆత్మకూర్(ఎం) మండలం కూరెళ్ల గ్రామంలోని తమ స్వగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆలేరు ఎమ్మెల్యేగా గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి గెలుపు కోసం రెండు సార్లు విశేషంగా కృషి చేసినట్లు పేర్కొన్నారు. తమ ఎదుగుదలను జీర్ణించుకోలేని మాజీ ఎమ్మెల్యే దంపతులు పక్కనబెట్టి అగౌరవ పరిచినట్లు వెల్లడించారు. పార్టీ కోసం పని చేస్తుంటే ఎమ్మెల్యే దంపతుల వద్ద కనీస గౌరవం కూడా లేకుండా పోతుందన్నారు. రాజీనామా పత్రాలను వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు, జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డికి పంపించనున్నట్లు చెప్పారు. బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన వారిలో వారి వెంట ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బెజ్జంకి భిక్షం, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బాషబోయిన లింగయ్య యాదవ్, ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పల నర్సింహ ఉన్నారు.

ఆడబిడ్డలపై ఆగని అఘాయిత్యాలు



భువనగిరిలోని వినాయక చౌరస్తా వద్ద రాస్తారోకో చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

- ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ

భువనగిరి : ప్రభుత్వాలు మారినా ఆడబిడ్డలపై అఘాయిత్యాలు ఆగడం లేదని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ ఆవేదనవ్యక్తం చేశారు. భువనగిరిలోని ఎస్సీ హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య ఘటనపై పాలకులు స్పందించకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో స్థానిక వినాయక చౌరస్తా వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు భవ్య, వైష్ణవిల ఆత్మహత్యకు కారణమైన వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలో భద్రత లోపాలు చాలా వరకు ఉన్నాయన్నారు. విద్యార్థినుల కుటుంబాలకు న్యాయం జరిగే వరకు ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. అంతకు ముందు ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ రంజిత్, సుర్వి మణికంఠ, జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, దీపిక, సాయిరాం, సాయికిరణ్, శివ, నితిన్, సాయికుమార్, సిద్దు పాల్గొన్నారు.

పోచంపల్లికి ఫ్యాషన్ డిజైన్ విద్యార్థులు



మగ్గాలను పరిశీలిస్తున్న ఫ్యాషన్ డిజైన్ విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి: హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్) చెందిన ఢిల్లీ, కేరళ, గుజరాత్, ముంబై, పశ్చిమబెంగాల్, బిహార్ తదితర రాష్ట్రాలకు చెందిన 13 మంది ఫ్యాషన్ డిజైన్ విద్యార్థులు మంగళవారం భూదాన్ పోచంపల్లిని సందర్శించారు. చేనేత గృహాలు, చేనేత సహకార సంఘం, టూరిజం పార్కును సందర్శించి అక్కడ మగ్గాలపై తయారవుతున్న చేనేత వస్త్రాలను పరిశీలించారు. ఇక్కత్ డిజైన్లలో వస్తున్న మార్పులు, చేనేతకళాకారులకు లభిస్తున్న గిట్టుబాటు ధర, కార్మికులకు అమలవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, మార్కెటింగ్ విధానాలు, చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న ఒడిదొడుకులను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. పోచంపల్లి ఇక్కత్‌వస్త్రాలకు బహిరంగ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నా, ఇక్కడి కార్మికులు తమ ఉత్పత్తులను సరిగ్గా మార్కెటింగ్ చేసుకోలేకపోతున్నారని అన్నారు. ప్రధాన నగరాలలోని షోరూమ్‌లలో జీఎస్టీ తదితర పన్నులు వేసి రెట్టింపు ధరలకు అమ్ముతుంటే, స్థానికంగా మాత్రం మార్కెటింగ్‌లో ఎందుకు వెనకబడిపోతున్నారో అధ్యయనం చేస్తున్నామని అన్నారు. మారుతున్న ప్రజల అభిరుచులకు అనుగుణంగా నూతన డిజైన్లలను రూపొందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. వీరికి ఫ్యాకల్టీ రాజ్యలక్ష్మి మార్గదర్శనం చేశారు.

నకిలీ పోలీసుల ముఠా అరెస్ట్

మిర్యాలగూడ టౌన్ : పోలీసులమని పేర్కొంటూ డబ్బులను వసూలు చేస్తున్న ముఠాను మంగళవారం మిర్యాలగూడ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. దామరచర్ల మండలం కేజేఆర్ కాలనీకి చెందిన ధనావత్ పవన్, దీలావర్‌పూర్ గ్రామానికి చెందిన చింతల మహేష్, గేర్‌తండాకు చెందిన ఆడావత్ రాము, మిర్యాలగూడ మండలం వాల్యాతండాకు చెందిన భాణావత్ నగేష్ ముఠాగా ఏర్పడ్డారు. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం బుడ్డితండాకు చెందిన వడిత్య భరత్ వృత్తి రీత్యా పశువుల వ్యాపారి. భరత్ ఈ నెల 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిలకలూరిపేటలోని పశువులను కొనుగోలు చేసుకొని టాటా ఏస్ వాహనంలో తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో మిర్యాలగూడ మండలం గూడూరు వద్ద తాము పోలీసుల మంటూ ఆ వాహనాన్ని అడ్డగించారు. అనంతరం భరత్‌ను రూ.3లక్షలను డిమాండ్ చేయగా చివరికి రూ.23 వేలు ఇచ్చేందుకు బాధితుడు అంగీకరించాడు. తాను ఇంటికి వెళ్లి డబ్బులు తీసువస్తానని చెప్పి వెళ్లాడు. తిరిగి వచ్చిన బాధితుడు ఈనెల 5న రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు గూడూరు సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అరెస్ట్ చేశారు. అనంతరం ఇంచార్జి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి స్వర్ణలత ఎదుట హాజరు పరిచారు.

మీటర్ రీడింగ్ కార్మికుల ఆందోళన

- ఆర్టిజన్లుగా గుర్తించాలని డిమాండ్
- రీడింగ్ మిషన్లను ఏడీలకు అప్పగింత
- ‘గృహజ్యోతి’ ఆన్‌లైన్‌కు అవాంతరాలు

నల్లగొండ : విద్యుత్ శాఖలో మీటర్ రీడింగ్ కార్మికులు ఆందోళన బాట పట్టారు. 20 సంవత్సరాలుగా విద్యుత్ శాఖలో కాంట్రాక్టర్ ద్వారా వేతనాలు తీసుకుంటూ 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు మీటర్ రీడింగ్ తీస్తున్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కొంతకాలంగా ప్రభుత్వానికి విన్నవించడంతో పాటు గతంలో సమ్మె కూడా చేశారు. ఇప్పటికే పనికి తగ్గ ప్రోత్సాహకం అందక ఇబ్బందులు పడుతుంటే.. ఇప్పుడు గృహజ్యోతి పథకానికి సంబంధించిన వివరాలు సేకరించాలని అధికారులు ఆదేశించడంతో వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రీడింగ్ మిషన్లను ఏడీలకు అప్పగించి నిరసన తెలిపారు.



నిరసన తెలుపుతున్న విద్యుత్ కార్మికులు

ఇప్పటికే 50 శాతం ఇళ్ల రీడింగ్ పూర్తి

అయితే ప్రస్తుతం కొత్త ప్రభుత్వం గృహ జ్యోతి పథకం కింద అర్హులైన వారికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేసేందుకు పూనుకుంది. ఇందుకోసం విద్యుత్ వినియోగదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లు, మీటర్ రీడింగ్ సిబ్బందికి సూచించింది. ఈ ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభమైంది. అయితే జిల్లాలో 250 మంది వరకు ఉన్న మీటర్ రీడింగ్ కార్మికులు ఇప్పటికే తాము 50 శాతం వరకు ఇళ్లకు రీడింగ్ తీశామని మళ్లీ అన్ని ఇళ్లకు వెళ్లి డేటా నమోదు చేయాలంటే చాలా సమయం పడుతుందని వారు పేర్కొంటున్నారు. వీరి ఆందోళనతో గృహజ్యోతి ఆన్‌లైన్ ప్రక్రియకు అవాంతాలు ఎదురయ్యే అవకాశం ఉంది.

ప్రభుత్వం న్యాయం చేయాలి

నెలలో ఒక్కో కార్మికుడు 1500 నుంచి 3000 కనెక్షన్ల రీడింగ్ తీస్తారు. అందుకు ఒక్కో కనెక్షన్‌కు రూ.5.30 మాత్రమే కాంట్రాక్టర్ చెల్లిస్తారు. అందులో జీఎస్టీ, ఈపీఎఫ్, ఈఎస్‌ఐ చెల్లింపుతో పాటు రీడింగ్, పేపర్ రోల్స్ కూడా వారి వచ్చే వేతనంలో నుంచే కొనాల్సి వస్తున్నందున నెలకు రూ.4 వేలు కూడా రావడం లేదని మీటర్ రీడింగ్ కార్మికులు ఆవేదన చెందుతున్నారు. వేతనం సరిపోక ఇతర కరెంట్ పనులు చేసుకుంటున్నామని.. తమను ఆర్టిజన్లుగా గుర్తించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం న్యాయం చేసే వరకు ఆందోళన విరమించేది లేదని పేర్కొన్నారు.